# ఊహలు గుసగుసలాడె!





కాకాని కమల

"రంజనీ! అన్నయ్య సాయంత్రం ఆరు గంటల ట్రైన్‌కి నాగపూర్ పోతున్నాడు. మరీ మరీ నీకు చెప్పమన్నాడు." హడావిడిగా కాలేజీకి వెడుతూ సుడిగాలిలా వచ్చి తనకి ఆ వార్త అందించి వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోతున్న నిర్మలని పట్టుకుని ఆపింది రంజని.

"ఏమిటే అంత హడావుడి."

"హడావుడే. ఇవాళ మా కాలేజీలో ఫంక్షన్ వుంది. ఓ డ్రామాలో నేనూ వున్నాను."

"అలాగా?"

"అవును. ఇవ్వాళ సాయంత్రం నందూ అన్నయ్య ఊరికి వెళ్ళిపోతున్నాడు. ఉదయం నించి నిన్ను చాలా జ్ఞాపకం చేసుకున్నాడు. అందుకే చెప్పడానికి వచ్చాను. బయట నా ఫ్రెండ్స్ వెయిట్ చేస్తున్నారు" అంటూ పిల్చినా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది నిర్మల.

కానీ రంజని మనసు స్థిమితం తప్పింది.

ఏ పని చేస్తున్నా నిర్మల చెప్పిన మాటలే మనసులో మార్మ్రోగుతున్నాయి.

అలవాటు చొప్పున సంగీత సాధనకి కూర్చుంది.

కానీ మనసు లగ్నం కావడం లేదు.

చాలాసార్లు సాధన చేసిన 'సంగతులే' అయినా స్వరాలు అపశృతి పలుకుతున్నాయి.

"సాయంత్రం నందూ వెళ్ళిపోతున్నాడు... మరీ మరీ నీకు చెప్ప...... "

చెవుల్లో ఒకటే హోరు...

మునివేళ్ళతో మదిటె మీద కదిలిస్తూ వీణకి అల వోకగా తల వాల్చి నిశ్శబ్దంగా వుండిపోయింది.

అతను...

నందూ... ఊరికి వెళ్ళిపోతున్నాడా?

అయితే...

ఆ విషయం తనకి ఎందుకు చెప్పమన్నట్టు?

కాలేజీకి వెడుతూ నిర్మల అంత హడావుడిలోనూ తనకి వచ్చి చెప్పింది అంటే... బహుశా నందకుమార్ నిజంగానే మరీ మరీ చెప్పి వుంటాడు.

అతను రావడం, వెళ్ళడం కొత్తకాదు.

కాని ఎన్నడూ లేనిది ఈసారి ప్రత్యేకం తనకి చెప్పమనటంలో అర్థం ఏమిటి?

'సెండాఫ్' ఇవ్వడానికి తనని స్టేషన్‌కి రమ్మనా?

లేక...

తనతో... ఒంటరిగా... ఏ...కాంతంలో... ఏదైనా చెప్పాలనుకుంటున్నాడా?

రంజని పెదవుల మీద మనోహరమైన ఒక నవ్వుని చిరునవ్వు కదిలింది.

వీణ తీగను గట్టిగా బిగించి మృదువుగా కొన వ్రేళ్ళతో తీగల మీద మృదువుగా కదిలించింది.

ఝుమ్మ్... ఝుమ్మ్‌మంటూ నవ్వుగా మ్రోగే ఆ వీణానాదంలో ఏదో అలౌకిక భావన! మధుర ఆలాపన.

నందూ వెళ్ళిపోతున్నాడనుకొంటే మనసంతా శూన్యంగా అనిపిస్తోంది.

అతను వచ్చాడు అన్న వార్త వినగానే ఆనందపడడం, వెళ్ళిపోతుంటే వెలితి పడడం... గత రెండు సంవత్సరాలుగా అలవాటయిపోయింది.

అయినా ఎప్పటికప్పుడు ఏదో కొత్త!

అతనితో గడిపిన ప్రతి క్షణం తన మనస్సులో మరిచిపోలేని ఒక మధుర స్మృతి.

నందూ ఇంజనీరింగ్ స్టూడెంట్.

కాలేజీకి టర్మ్ హాలిడేస్ ఇచ్చినా, పండుగ శెలవులు వచ్చినా అతను వస్తాడు. ఆఖరికి ఏ శలవులూ లేకపోతే శనాదివారాలు కలిపి వచ్చేలా చూసుకుని ఒక రోజైనా సరే వుండి వెళ్ళిపోతాడు.

రంజనికి నిర్మలతో చాలా కాలంగానే పరిచయం వుంది. అతను అంతకు ముందు వచ్చిన జాడ లేదు. కాని గత రెండు సంవత్సరాలుగా ఎక్కువగా రావడం గమనించిన రంజని ఒకసారి నిర్మలని అదే అడిగింది.

"అవును. అన్నయ్య ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరంలో వున్నాడు. అన్నయ్యకి ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేదు. ఇక్కడే ఏదో ప్రైవేట్ ఫర్మ్ పెడతాడుట. ఆ పని మీదనే తరచూ వస్తున్నాడనుకుంటాను. ఇక్కడ ఎవరో మంచి ఫ్రెండ్స్ వున్నారట" అంది నిర్మల.

అతను పెట్టబోయే ఫర్మ్ ఏమిటో! అంత మంచి ఫ్రెండ్స్ ఎవరో తెలుసుకోవాలనిపించింది రంజనికి. అందుకు వుండబట్టలేక-

"అస్తమానం మీరు మా ఊరికి వస్తారు కదా? మీ చెల్లెలంటే అంత ఇష్టమా మీకు?" అంది ఒకసారి.

నందకుమార్ హుందాగా నవ్వి- "ఒక్క షూ నిమ్మియే కాదు. ఈ ఊర్లో నాకు ఇంకా చాలా ఇష్టాలు అనుబంధాలూ వున్నాయి" అన్నాడు.

ఆ మాటలు అంటున్నప్పుడు అతని కళ్ళల్లో కదిలిన వింత భావన, గిలిగింతలు పెట్టే అతని నవ్వు రంజనికి ఏదో అనంత సందేశాన్ని అందించింది.

అతనితో మొదటిసారిగా పరిచయం అయిన రోజు నిర్మల "అన్నయ్యా! మా రంజని మంచి సింగర్. సెవెన్‌స్టార్ ఆర్కెస్ట్రాలో పాడుతుంది. తరచూ బయట వూళ్ళకి వెళ్ళి ప్రోగ్రామ్స్ కూడా ఇస్తుంది." అంటూ మొదటిసారిగా పరిచయం చేసినప్పుడు అతను ఆనందంతో కేక పెట్టినంత పని చేశాడు.

"అలాగా! అయితే తప్పకుండా నాకు మీ పాట వినిపించాలి. ఎందుకంటే నేను మ్యూజిక్ లవర్‌ని. పాటలంటేచాలు... చెవ్వి కోసుకొంటాను" అన్నాడు.

ఆ క్షణంలో అతని వుత్సాహం చూస్తే ముచ్చట అనిపించింది. పది మంది ముందు పాడడం తనకి కొత్తకాకపోవడంతో అతని చేత ఎక్కువగా బ్రతిమాలించుకోకుండానే "కన్నుల్లో వెన్నెల దీపం" పాడింది.

పాట పూర్తి అయి పది నిమిషాలు అయినా అతను అలాగే చెదరని శిల్పంలా స్తబ్ధుగా వుండిపోయాడు.

ఆ పాట అతడ్ని ఏ లోకాల్లోకో తీసుకెళ్ళినట్టు అనుభూతి చెందుతూ ఉద్వేగంతో-

"రియల్లీ ఫెంటాస్టిక్! నిజంగా ఎంతో అద్భుతంగా పాడారు?" అంటూ రంజని చేతిని పట్టుకొని మృదువుగా స్పృశించి వదిలేశాడు. అప్పటికప్పుడు జేబులోంచి పెన్ను తీసి-

"మిస్ రంజనీ! ప్లీజ్... ఇది నా జ్ఞాపకంగా



వుంచుకోండి. ఇది ఆర్డినరీ పెన్ను కాదు. ఇంపోర్టెడ్. మంచి కాస్ట్లీ పెన్ను. ఇది బ్యాటరీతో పని చేస్తుంది. టైమ్, డేటు, అలారం ఇందులో వస్తాయి చూడండి" అంటూ అప్పటికప్పుడూ బటన్స్ నొక్కి ఆపరేట్ చేసి చూపించాడు.

నిజంగానే పెన్ను చాలా అద్భుతంగా వుంది. కాని...

"ఇంత కాస్ట్లీ పెన్ను నాకెందుకు?" అంది బిడియంగా.

"అలాక్కాదు. మీరు మంచి గిఫ్ట్ వున్న ఆర్టిస్టు. నేను మ్యూజిక్ లవర్‌ని. మన పరిచయానికి ఈ చిన్న గుర్తు" అన్నాడు.

ఆ క్షణంలో అతన్ని చూస్తే నిజంగానే పాటలంటే చెవి కోసుకుంటాడు అనిపించింది.

ఆ తరువాత అతనికిష్టమైన పాటలు అడిగి పాడించు కొన్నాడు.

"రంజనీ! మీ పేరుకి తగినట్టుగానే వుంది మీ పాట" అన్నాడు ప్రశంసగా.

అలాంటి ప్రశంసలు... అభినందనలు కొత్త కాదు రంజనికి. నిజంగానే ఆమెది స్వీట్ వాయిస్.

"నేను తరచూ ఈ ఊరు వస్తుంటాను. వచ్చినప్పు డల్లా మీ పాట వినిపించాలి" అన్నాడు వాగ్దానం తీసుకొంటున్నట్టు.

అంతే.

ఆ విధంగా అతనితో మొదలయిన పరిచయం ఈ రెండు సంవత్సరాల్లోనూ మరింత గాఢ మయ్యింది.

రానురాను నందూ కోసం నిర్మల కంటే ఎక్కువగా ఎదురు చూసే స్థితికి వచ్చింది.

అసలు...

కొంత మందిని చూసినప్పుడు ఒక విధమైన ఇష్టం ఎందుకు ఏర్పడుతుందో...

మరి కొంత మందిని చూసినప్పుడు అకారణంగా ద్వేషం ఎందుకు కలుగుతుందో... అంతా మనకి తెలియ కుండానే జరిగి పోతుంది. నందకుమార్ ఒకసారి మాటలు మధ్యలో అడిగాడు-

"మిస్ రంజనీ! మీ ఆశయం ఏమిటి?"

"వేరే ఏముంది? మంచి సింగర్‌గా పేరు తెచ్చు కోవాలని. అంతే కాదు. డబ్బు కూడా నాకు ముఖ్యమే. నా సంపాదనతో నా కుటుంబానికి అవసరం వుంది. మాది కొంచెం పూర్ ఫ్యామిలీ." అంది కాస్త బిడియంగా.

అతను ఆసక్తిగా కాస్తముందుకి ఒంగి-

"మరి... పెళ్ళి చేసుకోరా?" అనడిగాడు.

రంజని చిరునవ్వు నవ్వింది.

"ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్లి అంటే మాటలా? మా వాళ్ళు చిల్లిగవ్వ కూడా కట్నం ఇవ్వలేరు. నన్నెవరు చేసుకుంటారు? పైగా నేను ఆర్కెస్ట్రాలో పాడతాను. సాధారణంగా మా ప్రోగ్రామ్స్ అన్నీ నైట్ టైమ్‌లోనే వుంటాయి. తరచు మా ట్రూప్‌తో కలిసి నేను బయట ఊళ్ళకి కూడా వెళుతూ వుంటాను. ఈ విషయంలో నన్ను తీవ్రంగా విమర్శించే వాళ్ళు కూడా వున్నారు" అంది. ఆ మాటలు చెపుతున్నప్పుడు ఆమె కంఠంలో ఒక రకమైన ఏగోనీ!

అతను నొచ్చుకున్నట్టు చూశాడు.

"అదే మన్నమాట. మీలోని ఆర్ట్‌ని చూసి ఇష్టపడే వ్యక్తి మిమ్మల్ని చేసుకోవచ్చు కదా? మండు వేసవిలో... చల్లని గాలి వీసిరే సాయం సంధ్యలో మామిడి గుబురు లోంచి వినిపించే కోయిల పాటకి ఖరీదు కట్టగలమా?"

"అఫ్ కోర్స్..." రంజని అలవోకగా కనురెప్పలు కదిలించింది.

"ఇక కట్నం అంటారా? అయినా ఈ రోజుల్లో కూడా ఇంకా కట్నాలు, కానుకలు, నాతాలు ఏమిటి!? నా మటుకు నేను వీటిని హేట్ చేస్తాను." అన్నాడు ఆవేశంగా.

రంజని మనసు ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటమే అయిపోయింది.

ఆమె మనసు నిండా ఆశలు మోగాలు.

కళ్ళు మూస్తే రంగు రంగుల కలలు...

ఒంటరిగా కూర్చుంటే నందకుమార్ మాటలే జ్ఞాపకం వస్తాయి. ముఖ్యంగా అతని నవ్వు!

వెన్నెల జల్లులా కురిసినట్టు ఎంత చక్కటి నవ్వు?

"రంజనీ! అన్నయ్యకి నువ్వంటే చాలా ఇష్టం. అస్తమానం నీ పాట గురించే పొగుడుతాడు. ఎప్పుడు ఉత్తరం వ్రాసినా నీ గురించి అడగడం మరిచి పోడు."

"ఠంగ్... ఠంగ్" గడియారం ఐదు గంటలు కొట్టింది. రంజని వులిక్కి పడింది.

"బాప్‌రే! తను గంట సేపట్నుంచి ఇలా కూర్చుందా?"

గభాల్న లేచి ఒళ్ళో వీణని ప్రక్కన పెట్టి చాప ఎత్తి పెట్టి పుస్తకాలు షెల్ఫ్‌లో సర్దేసింది.

"సాయంత్రం ఆరు గంటల ట్రైన్‌కి అన్నయ్యా..." ఏ పని చేస్తున్నా నిర్మల మాటలు మనసులో హెచ్చరికగా కదులు తున్నాయి.

నందూ తన కోసం ట్రైను దగ్గర ఎదురు చూస్తాడేమో! అతడు తనతో ఏమైనా చెప్పాలను కుంటు న్నాడా? లేకపోతే ప్రత్యేకంగానిర్మల ఎందుకు ననిగట్టు కొని వచ్చి చెపుతుంది?

రంజని మనసు కొట్టుకుంటోంది...

'రవ్వంత సడిలేని రసరమ్య గీతం' లాంటి అతని నవ్వు వెంటాడు తుంటే ఆఖరికి స్టేషన్‌కి వెళ్ళటానికే నిర్ణయించుకొని వుత్సాహంగా బట్టల అల్మారా దగ్గరికి వచ్చి నిలుచుంది.

"రంజనీ! మీరు ఈ లైట్ ఆరంజి కలరు చీరలో చాలా అందంగా వుంటారు. మీకు ఈ కలర్ బాగా మాట య్యింది" అతని ప్రశంస మనసులో కదులుతుంటే హ్యాంగర్‌కి వున్న లేతనారింజ రంగు ఆర్గండి చీర, మ్యాచింగ్ జాకెట్టు తీసి మంచం మీద పెట్టి టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వచ్చింది.

"ఊహలు గుసగుసలాడే...

నా హృదయము వూగిసలాడే

నలదన్న వినదీ మనసు......" చల్లటి నీళ్ళతో కలిసి హమ్మింగ్ చేస్తూ హాయిగా స్నానం చేసి అతనికిష్టమైన చీరలో డ్రెస్సింగ్ అద్దం ముందుకి వచ్చి కూర్చుంది.

'తను ఈ చామనచాయ కంటే కొంచెం రంగు వుంటే బాగుండేది!' అనుకుంటూ క్రీము రాసు కుని పఫ్‌తో పౌడర్ అద్దుకుంది. స్టిక్కర్ బొట్టుని రెండు కనుబొమల మధ్య ప్రెస్ చేసింది.

"రతీదేవి ప్రతీ ఆడపిల్లకి ఒక వరం ఇస్తుందట. కొంత మందికి రెండు మూడు ఇస్తుందట. బహుశా రతీదేవి తనకి ఒకటే వరం ఇచ్చి వుంటుంది" అనుకుంది నల్లగా ఒత్తుగా వున్న తన నొక్కుల జుత్తుకేసి చూసు కుంటూ. లేచి పెరట్లోకి వచ్చి కుండీలో చక్కగా విచ్చుకున్న లేత పసుపు రంగు గులాబిని ఆకులతో జాగ్రత్తగా కత్తిరించి, అద్దంలో చూసుకుంటూ చెవి ప్రక్కగా జుత్తులోకి అపురూపంగా క్లిప్ చేసింది.

"అందం నిస్సందేహంగా ఆడవాళ్ళదే. అలంక రించుకుంటే ఎలాంటి ఆడపిల్లా అద్భుతంగా వుంటుంది" అన్న ఒక ఆధునిక రచయిత మాటలు గుర్తుకి వచ్చి రంజని పెదాలు సన్నని చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

అద్దంలోని ప్రతిబింబాన్ని తృప్తిగా చూసుకోక ముందే కాలాన్ని గుర్తుచేస్తూ గడియారం మళ్ళీ

"ఠంగ్..." మని అరగంట కొట్టింది.

రంజని వులికి పాటుని కప్పి పుచ్చుకుంటూ గడి యారం కేసి చూసింది.

టైము ఐదున్నర అయ్యింది.

"అన్నయ్య... సాయం... ట్రైనుకి... నీకు... మరీ... మరీ..."

మళ్ళీ నిర్మల కంఠం హెచ్చరికగా చెవుల్లో రింగు మంది.

"బాప్‌రే..." అనుకుంటూ హ్యాండ్ బాగ్ అందు కుని వంటగది వైపు పరిగెత్తింది.

బియ్యం ఏరుతున్న తల్లి కేసి చూస్తూ "అమ్మా! ఆర్కెస్ట్రా వాళ్ళు ఎందుకో అర్జంటుగా రమ్మని కబురు పెట్టారు. వెళ్ళి ఓ గంటలో వచ్చేస్తాను" అంటూ కేక పెట్టి చెప్పులు తొడుక్కుని హడావుడిగా రోడ్డు మీదికి వచ్చింది.

ఖాళీగా పోతున్న ఆటోలో ఎక్కి కూర్చుని "తొందరగా పోనీయ్" అంటూ హెచ్చరించింది.

పావు గంటలో ఆటో రైలు స్టేషన్ ముందు ఆగింది.

అప్పటికే ట్రైన్ ప్లాట్ ఫాం మీద సిద్ధంగా వుంది.

సరిగ్గా ఆరింటికి డిపార్చర్.

నందూ ఈ పాటికి వచ్చి వుంటాడా? తన రాక కోసం ఎదురు చూస్తున్నాడేమో... అతనికి నచ్చిన చీరలో అతనికి నచ్చిన అలంకరణలో వున్న తనని చూసి ఏమంటాడు? వెళ్ళే ముందు ఏకాంతంలో తనతో ఏం చెప్పబోతున్నాడు?' ఉద్వేగంతో గుండె కొట్టు కుంటుం టే ప్లాట్‌ఫాం టిక్కెట్టు కొనుక్కుని పరుగు లాంటి నడకతో స్టేషన్‌లోకి వచ్చింది.

ఆమె ఎక్కువ కష్టపడనక్కరలేకుండానే ఎదురుగా వున్న ఫస్ట్ క్లాస్ కూపె ఎంట్రన్స్ దగ్గర ఎవరికోసమో నిరీక్షిస్తూ చూపులతోనే ప్లాట్ ఫాం అంతా కలయ వెదుకుతూ నిల్చుని వున్నాడు నంద కుమార్.

అప్రయత్నంగా ఇద్దరి చూపులు కలుసుకున్నాయ్.

"హాయ్... ఏమిటి మీరిలాగ?" అన్నాడు నందూ.


అతని కళ్ళనిండా ఆనందం... ఆశ్చర్యం!

రంజని కొంచెం సిగ్గుతో కళ్ళు దించుకుంది.

"అ... అవు...నా... నా ఫ్రెండ్ ఒకామె ఈ ట్రైనులో వెళ్ళిపోతున్నట్లు తెలిసింది. అందుకే వచ్చాను... కాని... కనిపించలేదు. బహుశా ... వెళ్ళడం లేదే...మో..." అప్పటికప్పుడు నట్టుతూ ఎలాగో ఒక చిన్న అబద్ధం కల్పించి చెప్పి "హమ్మయ్య" అనుకుంది.

అతను ఏదో అర్థం అయినట్లు నవ్వుగా నవ్వి రంజని కట్టుకున్న ఆరంజి కలర్ చీరకేసి, చెవి ప్రక్కగా పెట్టు కొన్న పసుపు రంగు గులాబి కేసి ప్రశంసగా చూస్తూ "అలాగా?" అన్నాడు.

అంతలోనే ఆమెపై నుంచి హఠాత్తుగా చూపులు ప్రక్కకి తప్పించి మళ్ళీ చుట్టు ప్రక్కల కలయ చూస్తూ బోగీ ఎంట్రన్స్‌లోంచి కిందికి దిగి "చెప్పండి రంజని! మళ్ళీ మీ పాట నాకు ఎప్పుడు వినిపిస్తారు?" అన్నాడు.



## గుండె

జోన్ ఆఫ్ ఆర్క్ మంటల్లో కాలిపోయిన తర్వాత మిగిలిన భస్మంలో ఆమె గుండె మాత్రం కాలిపోకుండా యథాతథంగా వుండిపోయింది. ఎందువల్ల అలా జరి గిందో ఇంతవరకూ ఎవ్వరూ చెప్పలేక పోతున్నారు!

— కొడిమెల శ్రీరామమూర్తి

"మళ్ళీ మీరు మా ఊరు ఎప్పుడు వస్తే అప్పుడు" అంది. నంద కుమార్ దూరంగా చూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్లు తల కదిలించి మునివేళ్ళతో గెడ్డం దగ్గర రాసుకుంటూ

"తొందర్లోనే వస్తాను. అన్నట్లు మిస్ రంజనీ! ఈసారి వచ్చినప్పుడు మిమ్మల్ని కూడా నాతో మా ఊరు తీసుకెడతాను. ఎందుకని అడగరేం?" కంటి కొనలతో నవ్వుతూ వుత్సాహంగా ఆమెకేసి చూశాడు.

రంజని గుండె ఝల్లుమంది.

చెంపలు ఎరుపెక్కుతుంటే కళ్ళు కిందికి వాల్చు కొని "ఎం...దు...కు?" అంది తడబాటుని కప్పి పుచ్చుకుంటు.

అతను నవ్వి "చెప్తాను. మీకు చెప్పాలన్నదే నా కోరిక. కాని సరిగ్గా ట్రైన్ కదిలే ముందు చెప్తాను" అన్నాడు అస్పష్టంగా.

అతని మనసు ఎక్కడో వుంది. ఆమెతో మాట్లా డుతున్నాడన్న మాటేగాని అంతంగా దేనికోసమో చుట్టు కలయ వెదుకుతున్నాడు.

మనిషి ఎందుకో టెన్షన్‌గా వున్నాడు. చూపులు చంచలంగా వున్నాయి.

అది గమనించిన రంజని - "ఏమిటి అలా చూస్తున్నారు? ఎవరైనా రావాలా?" అంది విస్తుపోతు న్నట్లు.

అతను నోరు తెరిచి ఏదో చెప్పబోయిన వాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు.

అతని కళ్ళు ఆనందంతో తళతళా మెరిశాయి.

చందమామలోని వెన్నెల అంతా అతని మొఖంలోకే వచ్చినట్లు కాంతివంతం అయ్యింది.

"హాయ్..." అంటూ ఉద్వేగంతో రంజన్ని దాటు కుంటూ ముందుకి వెళ్ళాడు.

అయోమయంగా వెనక్కి తిరిగిన రంజని స్తంభించి నట్టు అయ్యింది.

అప్పటికే ఒక అందమైన అమ్మాయి అతని బలమైన చేతుల మధ్య నాజూకుగా ఒదిగి పోయింది.

లేత గులాబి రంగు దుస్తుల్లో అచ్చు గులాబిలాగే వున్న ఆ సౌందర్యరాశి కేసి చూస్తూ రంజని మాటలు రాని మూగబొమ్మ అయ్యింది.

అది పబ్లిక్ ప్లేస్, రైల్వే ప్లాట్ ఫాం అన్న సంగతి కూడా మర్చి పోయిన వాడిలా నంద కుమార్ రెండు చేతుల మధ్య ఆర్తిగా ఆమె భుజాలు చుట్టి అపు రూపంగా ఆమెని పట్టుకొని నడిపించుకుంటూ రంజని దగ్గరకి తీసుకు వచ్చాడు.

"రంజనీ! ఈమె నా ఫియాన్సీ-మంజు! చిన్నప్పట్ను చి మంచి ఫ్రెండు. ఆమె డిగ్రీ అయ్యేదాకా కల్సి మెల్సి తిరిగాం. రెండు సంవత్సరాల క్రితం కమర్షియల్ బ్యాంకులో ఆమెకి ఉద్యోగం వచ్చింది. ఫస్ట్ అపాయింట్‌మెంట్ ఇక్కడిచ్చారు. హాస్టల్‌లో వుంటుం ది" అంటూ మంజుల కేసి తిరిగి-

"మంజూ! నీకు ఇంతకు ముందు చెప్పాను చూడు మిస్ రంజని మంచి సింగర్... అని ...ఈమే!" అన్నాడు.

పూలరేకుల మీద ఒక సన్నని వెన్నెల రేఖ జారినట్లు ఆమె అందంగా నవ్వి "నమస్తే" అంటూ చేతులు జోడించింది.

"రంజనీ! ఎవరికోసం ఎదురు చూస్తున్నారు? అని అడిగారు కదా! ఈమె కోసమే. నాతో పాటు ఈ ట్రైన్‌కి ఈమె కూడా నాగపూర్ వస్తోంది. వీళ్ళ పేరెంట్స్ కూడా అక్కడే వుంటారు. మేం ఇద్దరం ఈ సమ్మర్‌లో మ్యారేజి చేసుకోబోతున్నాం. కులాలు మతాలు అంటూ బహుశా మా ఇద్దరి పెద్దవాళ్ళు ఒప్పుకోక పోవచ్చు. అయినా మా నిర్ణయం మారదు. అన్నట్లు ఈ విషయం ఇంకా ఎవ్వరికీ తెలియదు. దయచేసి నిమ్మీకి కూడా అప్పుడే చెప్పకండి. ప్లీజ్..." అన్నాడు అభ్యర్థనగా చూస్తూ.

రంజనికి అంతా అయోమయంగా వుంది. ఏం చెప్పాలో తోచలేదు.

"రంజనీ! మిమ్మల్ని మా ఊరు తీసుకెడతానన్నాను ఎందుకో తెలుసా?"

"మా పెళ్ళి చాలా వరకూ నా ఫ్రెండ్స్ సహ కారంతోనే జరుగుతుంది. మీరు కూడా నాకు మంచి ఫ్రెండు గనక... నేను ఇచ్చే విందుతో పాటు మీ పాటల విందు కూడా చెయ్యాలి. మ్యూజిక్ లవర్‌గా అది నా కోరిక.

ఏమంటారు?" నందకుమార్ ఆనందంతో ఇంకా ఏదో చెప్తూనే వున్నాడు.

కాని-

రంజనికి అవేమీ వినిపించడం లేదు.

చెవుల్లో ఒకటే హోరు... ఎంత అదిమినా కళ్ళ నిండా నీళ్ళు నిండి చూపు మసక బారిపోతుంది.

ఇంతలో-

రైలు గట్టిగా కూత పెట్టి శబ్దం చేస్తూ కదిలింది.

■